సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



స్కూళ్లకు స్వచ్ఛత పోటీలు

కేంద్రం స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకుంది. 8లో▸



క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆంజనేయులు అన్నారు. 8లో▸



గుంతలమయంగా రోడ్లు!

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మర్పల్లి మండలంలోని రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన బొంరాస్‌పేట నాయకులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మండల నాయకులు, అధికారులు

బొంరాస్‌పేట: మండలానికి చెందిన పలువురు నాయకులు, అధికారులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలో కలిశారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు గురించి సీఎంకు వివరించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నాయకులు వెంకట్రాములు గౌడ్, జయకృష్ణ, మల్లేశ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకన్నగౌడ్, ఎంపీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ @2.25 లక్షలు



లడ్డూ ప్రసాదంతో వెంకట్రామ్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ప్రతిష్ఠించిన వినాయడి విగ్రహాలను గురువారం ప్రశాంతంగా నిమజ్జనం చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు అర్చనలు, అన్నదానాలు చేపట్టారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. పట్టణంలోని ఆలంపల్లి పంచముఖ హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను రూ.2.25 లక్షలకు లంకాల పెద్ద నరసింహారెడ్డి దక్కించుకున్నారు. మరో లడ్డూను గుడాటి రోజాశ్రీనాథ్‌రెడ్డి రూ.1.57 లక్షలకు, ధన్నారం హనుమాన్ మందిరంలో చిట్యాల వెంకట్రామ్‌రెడ్డి రూ.1.12 లక్షలకు.. ఎన్నెపల్లిలో మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి రూ.81వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

నైట్ షెల్టర్‌కు మరమ్మతులు చేయండి



నైట్ షెల్టర్ భవన పైకప్పును పరిశీలిస్తున్న సుజాత తదితరులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణ పరిధిలోని కుక్కల జనన నియంత్రణ కేంద్రాన్ని, నగర వాటిక, నైట్ షెల్టర్‌ను గురువారం మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైట్ షెల్టర్‌కు మరమ్మతులు చేసి వెంటనే అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం శివరాంనగర్ కాలనీలో మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొని గ్రూపులు ఏ విధంగా కొనసాగుతున్నాయనే విషయంపై ఆరా తీశారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మెప్మా పీడీ రవి, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ వెంకటేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లంబాడీలపై అసత్య ప్రచారం తగదు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు

పరిగి: లంబాడీలపై అసత్య ప్రచారం చేస్తున్న వారిని ఆయా పార్టీల నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో గిరిజన సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే లంబాడీలను గిరిజనుల జాబితా నుంచి తొలగించాలని రిట్ పిటీషన్ వేయడం సరికాదన్నారు. తమ జోలికి వస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు.

రేషన్.. సంబురం

కొత్త కార్డులకు బియ్యం కోటా మంజూరు

- మొదటిసారి నరుకులు తీసుకున్న లబ్ధిదారులు
- సంతోషం వ్యక్తం చేసిన కార్డుదారులు
- సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు

వికారాబాద్: దశాబ్ద కాల నిరీక్షణ ఫలించింది. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులకు ఈ నెల కోటా కేటాయించారు. ఒకటో తేదీ నుంచి కొత్త లబ్ధిదారులు రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నారు. మొదటి సారి బియ్యం పొందడంతో వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. పదేళ్లపాటు నిరీక్షించిన పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నారు. మర్పల్లి మండలానికి కొత్తగా 1,250 ఆహారభద్రత కార్డులు మంజూరయ్యాయి. 4,040 మందికి ఆరు కిలోల చొప్పున 24,240 కేజీల బియ్యం కోటా కేటాయించారు.



కొడంగల్ రూరల్: మొదటిసారి బియ్యం తీసుకుంటున్న సూర్యప్రకాష్

ధారూరు మండలానికి కొత్తగా 836 రేషన్ కార్డులు మంజూరు కాగా 5,016 కిలోల బియ్యం కేటాయించారు. కొడంగల్ మండలానికి కొత్తగా 1,243 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. దుద్యాల్ మండలానికి కొత్తగా 1,352 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. గురువారం పలువురు లబ్ధిదారులు మొదటిసారి రేషన్ బియ్యం తీసుకున్నారు.

తొలిసారి రేషన్ బియ్యం తీసుకున్నా..



నా వివాహం జరిగి ఎనిమిదేళ్లవుతోంది. నాటి నుంచి రేషన్ కార్డు కోసం పలుమార్లు దరఖాస్తు చేశా. కానీ కార్డు మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంజూరైంది. తొలిసారి రేషన్ సరుకులు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– బైండ్ల సాత్విక, నూతన లబ్ధిదారు, హస్నాబాద్

పన్నెండేళ్లపాటు నిరీక్షించాం



పెళ్లి చేసుకున్న నాటి నుంచి రేషన్‌కార్డు కోసం ఎదురు చూస్తున్నా.. పన్నెండేళ్లపాటు నిరీక్షించాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల బాధలను ఏ మాత్రం పట్టించుకోలేదు. కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోయా. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డు మంజూరు చేసింది. మా కుటుంబంలోని నలుగురి పేర్లు ఉన్నాయి. 24 కిలోల సన్నబియ్యం వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది.

– రేగొండి లలిత, రుద్రారం, ధారూరు మండలం



మర్పల్లి: మొదటిసారి బియ్యం తీసుకుంటున్న ముదాఫీర్

చాలా సంతోషంగా ఉంది

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డు కోసం పదేళ్ల పాటు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగా. కానీ ప్రయోజనం లేదు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కొత్త కార్డులు మంజూరు చేశారు. మా కుటుంబానికి కార్డు వచ్చింది. మొదటి సారి 12 కిలోల బియ్యం తెచ్చుకున్నా. చాలా సంతోషంగా ఉంది.

– హోటల్ ముదాఫీర్, మర్పల్లి



కొడంగల్ రూరల్: రేషన్ కార్డు మంజూరు పత్రాన్ని చూపుతున్న ఆవుల శ్రావణ్‌కుమార్

వెల్లివిరిసిన ఆనందం

కొడంగల్ మండలానికి కొత్తగా 1,243 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. 2,093 మంది దరఖాస్తు చేసుకోగా సగం మందికే కార్డులు వచ్చాయి. కార్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశామని పలువురు పేర్కొన్నారు. పదేళ్లపాటు ప్రభుత్వ పథకాలు పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ పేరిట కార్డు రావడంతో ఇందిరమ్మ ఇల్లు, ఇతర పథకాలకు దరఖాస్తు చేసుకుంటామని సంతోషంగా చెప్పారు.

పేదలకు దన్నుగా..

- జీఎస్టీ స్లాబ్‌ల కుదింపుతో మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి
- వ్యవసాయ ఉపకరణాలన్నీ ఐదు శాతం స్లాబ్‌లోకి..
- జిల్లాలో 2.8 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- మహిళలు, యువతకు ఎంతో మేలు



వికారాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ (వస్తు సేవల పన్ను) స్లాబ్‌ల కుదింపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు జీఎస్టీ(గూడ్స్ సర్వీస్ ట్యాక్స్) విధింపులో నాలుగు స్లాబ్‌లు ఉండగా వాటిని రెండింకి కుదించారు. పేదలు, రైతులు, మహిళలు, యువత వినియోగించే అనేక వస్తువులపై పన్ను భారాన్ని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పై వర్గాల ప్రజలు వినియోగించే వస్తువులు, 12 రకాల సేవలు, 18 శాతం ఉన్న వాటిని ఐదు శాతం స్లాబ్ లోకి మార్చారు. ఇందులో అనేక రకాల నిత్యావసర వస్తువులు సైతం ఉన్నాయి. దీంతో కుటుంబ ఖర్చులు కూడా తగ్గనున్నాయి. 18, 12 శాతం జీఎస్టీ ఉన్న కొన్ని రకాల వస్తువులను ఐదు శాతానికి తగ్గించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఖర్చులే కాకుండా వ్యక్తిగత ఖర్చు కూడా సగటున 10 శాతం ఆదా అయ్యే అవకాశం ఉందని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు. మన జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న రైతులు, మహిళలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో భారీ మేలు జరగనుంది.

రైతులు, మహిళలకు లబ్ధి

జిల్లాలో 2.8 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరు వినియోగించే వస్తువుల్లో ప్రధానమైనవి ఎరువులు, విత్తనాలపై ప్రభుత్వం ఇప్పటికే రాయితీలు వర్తింపజేస్తోంది. కొంత కాలంగా వ్యవసాయ వస్తువులపై రాయితీలు తగ్గిపోవడమే కాకుండా పన్నులు వడ్డింపు పరిధిలోకి వెళ్లాయి. దీంతో సాగు పెట్టుబడి ఖర్చులు పెరిగి వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రైతుకు వచ్చే నికర లాభం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. దీంతో నష్టాల పాలవుతున్నారు. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలపై పన్ను భారం తగ్గనుంది. రైతులు వినియోగించే ట్రాక్టర్ల టైర్లు, విడిభాగాలు, కొన్ని రకాల పురుగు మందులు, సూక్ష్మ పోషకాలు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులు కొనుగోలు ఖర్చులు తగ్గనున్నాయి. 18 నుంచి 12 శాతం స్లాబ్‌లోని వాటిని ఐదు శాతం జీఎస్టీ పరిధిలోకి తెచ్చారు. దీంతో జిల్లాలోని 2.8 లక్షల రైతులకు మేలు చేకూరనుంది. కుట్టు మిషన్లు, వాటి విడిభాగాలు, మహిళలు, చిన్నారుల కోసం వినియోగించే పలు రకాల వస్తువులపై పన్ను భారం తగ్గనుంది. జిల్లాలోని మూడు లక్షల పైచిలుకు మహిళలకు లబ్ధి చేకూరుతుంది.

తగ్గనున్న పన్ను భారం

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద, మధ్య తరగతి ప్రజలపై పన్ను భారం తగ్గనుంది. వారు వినియోగించే వస్తువుల ధరలు తగ్గనున్నాయి. టీవీలు, బైక్‌లు, చిన్న, మధ్య శ్రేణి కార్లు, వైద్య పరికరాలు, చిన్న పిల్లల కోసం వినియోగించేవి, విద్యార్థులకు అవసరమైన వస్తువులపై కూడా పన్నుల భారం తగ్గించింది.

బీజేపీ.. పేదల ప్రభుత్వం



మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమే. ఏ సంస్కరణలు తెచ్చినా.. ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా ఉంటాయి. జీఎస్టీ స్లాబ్‌ల కుదింపు నిర్ణయం ఎంతో మంచిది. ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ, జిల్లా అధ్యక్షుడు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తదితరులు


‘పాంబండ’ను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో వెలసిన శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఐఎఫ్ఎస్ ఆఫీసర్ కృష్ణతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో కేబుల్ బ్రిడ్జి, కొత్త భవనాలు, వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. పాంబండకు పర్యాటక శోభను తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి వనరులను పెంపొందించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్
- సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ



సీఎంకు రాసిన లేఖను చూపుతున్న రమేష్‌కుమార్

తాండూరు టౌన్: జిల్లాలో సాగునీటి వనరులను పెంపొందించాలంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి దగ్గర నిర్మించి చేవెళ్ల, వికారాబాద్ వరకు సాగునీరు తెస్తామని సీఎం చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. దీనికంటే ముందే జిల్లాలో సాగునీటి వనరుల పెంపు కోసం కృషి చేయాలని ఆయన కోరారు. కోట్‌పల్లి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించి 14వేల ఎకరాల వరకు ఆయకట్టు పెంచాలన్నారు. సర్పన్‌పల్లి, లక్నాపూర్, జుంటుపల్లి ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. కాగ్నానదిపై 6 టీఎంసీల మేర నీటి నిల్వ కోసం, మూసీ ఎగువ ప్రాంతమైన జిల్లా పరిధిలో సైతం చెక్‌డ్యాంలు నిర్మించి నీటి వృథాను అరికట్టాలన్నారు. యాలాల మండలంలోని శివసాగర్ ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగునీరందించేందుకు చెక్‌డ్యాంలు నిర్మించాలని కోరారు. అలాగే కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని జిల్లా వరకు పొడిగించాలని కోరారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి పరిగి నియోజకవర్గానికి నీరందించాలన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు.

బెస్ట్ టీచర్స్

రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎంపిక

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పలువురు టీచర్లకు అవార్డులు ప్రకటించింది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో బెస్ట్ టీచర్లుగా ఎంపికయ్యారు.



రమాదేవి

అబ్దుల్లాపూర్‌మెట్: బండరావిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.రమాదేవి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. 2002లో మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూర్ మండలం హరిజన్‌వాడ యూపీఎస్‌లో తొలిసారి ఆమె విధుల్లో చేరారు. 2013లో మండల స్థాయిలో.. 2018లో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. 2019లో బెస్ట్ రిజల్ట్స్ సాధించిన టీచర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నారు. 2020లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందని రమాదేవి పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో..



బాలాజీ

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద ప్రాథమి కోన్నత పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు కె.బాలాజీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 25 ఏళ్లుగా బోధనా వృత్తిలో కొనసాగుతున్న ఆయన ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఎంఆర్‌పీ, డీఆర్‌పీ, ఎస్ఆర్‌పీగా బాధ్యతలు నిర్వర్తించారు.

ధారూరు నుంచి ముగ్గురు



లక్ష్మీనర్సమ్మ



శ్రీనివాస్



సరిత

ధారూరు: మండలం నుంచి ముగ్గురు టీచర్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ధారూరు బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న లక్ష్మీనర్సమ్మ, మోమిన్‌కలాన్ ప్రాథమిక పాఠశాల టీచర్ శ్రీనివాస్, నాగసమందర్ పీఎస్ ఉపాధ్యాయురాలు సరిత ఉన్నారు.

కుల్కచర్ల నుంచి రమేశ్



కుల్కచర్ల: స్థానిక ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉప్పరి రమేశ్ జిల్లా ఉత్తమ టీచర్‌గా ఎంపికయ్యారు.

తాండూరు నుంచి ఆరుగురు

తాండూరు రూరల్: తాండూరు మండలం నుంచి ఆరుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో స్థానం దక్కించుకున్నారని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. వీరిలో గౌతపూర్ పాఠశాల హెచ్ఎం లీలావతి, మల్కాపూర్ హెచ్ఎం బాబ్యానాయక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూమీడియం ఉపాధ్యాయురాలు ఆరాధన, జినుగుర్తి హైస్కూల్ టీచర్ నాగరాజు, కేజీబీవీ టీచర్ బాలమణి, జినుగుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో పీఈటీ బుగ్గప్ప ఉన్నారు.

పేద విద్యార్థులకు సేవ..

హుడాకాంప్లెక్స్: విక్టోరియా మెమోరియల్ పాఠశాలలో పనిచేస్తున్న కళావతి ఉత్తమ టీచర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాది వికారాబాద్ జిల్లా ధారూరు మండలం హరిదాసుపల్లి గ్రామం. తండ్రి పాండు రంగారావు రైల్వేలో స్టేషన్ మాస్టారు. అమ్మ రత్నమ్మ గృహిణి. నేను 1993లో కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా చేరా. అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

పీజీలో స్పాట్ అడ్మిషన్లు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌సీ మొదటి సంవత్సరంలో 40 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎంఎస్‌సీలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థినులు ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బీపీసీలో 40శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా కళాశాలలో సంప్రదించాలని చెప్పారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరిన వారు డిగ్రీ, పీజీ పూర్తి చేసుకుంటారని, ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8978942246, 9703441345 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వివరించారు.

10న పోలింగ్ కేంద్రాల తుది జాబితా

అనంతగిరి: త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల జాబితా తయారీ, ప్రచురణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ నారాయణరెడ్డి(రంగారెడ్డి) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. 8న జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఉంటుందని వివరించారు. 6 నుంచి 8వ తేదీ వరకు మండల స్థాయిలో అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని తెలిపారు. 9న అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం ఉంటుందన్నారు. 10వ తేదీ తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ ఉంటుందని పేర్కొన్నారు.

యూరియా లారీ పట్టివేత

30 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు గుర్తింపు



పోలీసుల స్వాధీనం చేసుకున్న యూరియా లారీ

పరిగి: యూరియా లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగాపూర్ శివారు బీజాపూర్ జాతీయ రహదారిపై లారీ ఆగి ఉండటంతో పోలీసులు తనిఖీ చేశారు. అందులో యూరియా ఉండటంతో స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఏడీఏ లక్ష్మీకుమారి ఘటన స్థలానికి చేరుకుని యూరియాను పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. ఇది వ్యవసాయానికి సంబంధించినదా, లేకుంటే పరిశ్రమల యూరియా అనే పరీక్షిస్తామని తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇదీ.. 'ప్రత్యేక' పాలన!


సర్పంచుల పాలనలో..

ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. బషీరాబాద్ మేజర్ జీపీని పరిశుభ్రంగా ఉంచాల్సిన పంచాయతీ కార్యాలయం దుర్గంధం వెదజల్లుతోంది. ఆఫీసు ఆవరణ బురద, మురుగు నీటితో నిండిపోయింది. దీంతో దోమలు దడ పుట్టిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వస్తున్న స్థానికులు కార్యాలయ దుస్థితిని చూసి ముక్కు మూసుకుంటున్నారు. పలువురు వృద్ధులు, మహిళలు బురద నీటిలో జారి పడ్డారు. సర్పంచ్‌ల పాలనలో పచ్చని చెట్లు, పూల మొక్కలతో ఆహ్లాదం పంచిన కార్యాలయం ప్రస్తుతం కళావిహీనమైంది. ఆఫీసు పరిస్థితే ఇలా ఉంటే ఇక గ్రామంలో ఎలా ఉంటుందో 'ప్రత్యేక'ంగా చెప్పనక్కర్లేదు. – బషీరాబాద్


ప్రత్యేక అధికారుల పాలనలో ఇలా..

క్లుప్తంగా

గ్రామీణ కళాకారులను గుర్తించాలి


మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: గ్రామీణ కళాకారులను గుర్తించాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, సహాయ కార్యదర్శి గణేశ్ పేర్కొన్నారు. వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజానాట్యమండలి కళాకారుల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అర్హులకు పెన్షన్ మంజూరుచేయాలన్నారు. గ్రామాల్లోని డప్పు, వాయిద్యం, ఒగ్గు కళాకారులను గుర్తించి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, యాదయ్య, సత్తయ్య, శ్యామయ్య, రాజు, ఆనందం, వెంకట్, రాములు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్వర్‌రెడ్డి సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి కుటుంబసభ్యులు

పరిగి: మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి రాష్ట్ర మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగి నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

ఆయా వార్డుల్లో ఫాగింగ్ చేపడుతున్న సిబ్బంది


ఎన్టీఆర్ కాలనీలో ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాండూరు: మున్సిపల్ పరిధిలో దోమల నిర్మూలన పనులు చేపట్టారు. డెంగి కేసులు నమోదైన ప్రాంతాల్లో గురువారం తాండూరు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ కాలనీ, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేశారు. డెంగి కేసులను అరికట్టేందుకు మున్సిపల్ శాఖ చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ఫాగింగ్ చేపట్టాలని వైద్యశాఖ అధికారులు సూచించారు.

రాకంచర్ల గణేశ్ లడ్డూ రూ.3లక్షలు


వేలంలో దక్కించుకున్న పెంటన్న

పూడూరు: రాకంచర్లలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో రాకంచర్ల, తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ డీసీసీ కార్యదర్శి పెంటన్న రూ. 3లక్షలకు కైవసం చేసుకున్నాడు. మీర్జాపూర్‌లో రూ.46వేలకు మాజీ ఉప సర్పంచ్ సురేశ్ దక్కించుకున్నాడు. రాకంచర్ల గణేశ్‌లడ్డూ రూ. 3లక్షలు పలకడం మండలంలోనే ప్రథమం. అనంతరం ఉత్సవ నిర్వాహకులు పెంటన్నను సన్మానించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మహారాష్ట్రలోని చిల్పూర్ స్టేడియంలో ఆగస్టు 22నుంచి 24 వరకు నిర్వహించిన జాతీయస్థాయి లగోరి పోటీల్లో కుల్కచర్ల మండలానికి చెందిన 6గురు ప్రతిభ చాటారు. గురువారం ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయిలో..

జోనల్ స్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీలో కుల్కచర్ల బాలికల జెడ్పీ పాఠశాల ద్వితీయస్థానం సాధించింది. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి, పీఈటీ హిరీబాయి వారిని అభినందించారు.

రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు


రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కొడంగల్: నియోజకవర్గంలోని మూడు రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన లేవీ బియ్యం పంపిణీలో సంబంధిత రైస్ మిల్లులు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అధికారులు గుర్తించారు. ఈ నెల 12వ తేదీ వరకు ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. లేని పక్షంలో చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు. శ్రీ వేంకటేశ్వర రైస్ ట్రేడర్స్, శ్రీ గురు రాఘవేంద్ర రైస్ మిల్లు, శ్రీ లక్ష్మీ నరసింహ్మ స్వామి రైస్ మిల్లులు బియ్యం పంపిణీలో జాప్యం చేస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వానికి నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, డీసీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డీఎమ్ మోహన్ కృష్ణలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, సివిల్ సప్లై డీటీలు గణపతి రావ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయిస్తా


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బంట్వారం: చేవేళ్ల సమీపంలోని తోల్‌కట్టలో కొనసాగుతున్న బంట్వారం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలను స్థానికంగానే ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం కాంగ్రెస్ నాయకులు క్యాంప్ కార్యాలయంలో స్పీకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల ఇదే స్కూల్‌లో చదివే కోట్‌పల్లి మండలం బీరోల్‌కు చెందిన విద్యార్థిని, తండ్రితో పాటు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ప్రసాద్ కుమార్ బంట్వారంలోనే భవనం నిర్మింపజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు నాయకులు మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, నర్సింలు, శ్రీకాంత్, రమేశ్, కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కులు సాధ్యం

టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

కొత్తూరు: హక్కులు, తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు పిలుపునిచ్చారు. మండలంలోని ఇన్ముల్‌నర్వలో ఉన్న జేపీదర్గా ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ.. తుక్కుగూడలో ఈ నెల 26న సంఘం మూడో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా దర్గాలో విలేకరులతో కలిసి సన్నాహాక సమావేశాన్ని నిర్వహించామన్నారు. బలమైన సంఘం, జర్నలిస్టుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను సభలో చర్చించనున్నట్లు తెలిపారు. తుక్కుగూడలో నిర్వహించే మహాసభలకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సురేష్, శ్రీనివాస్ చారి, గణేష్, మోహన్‌రెడ్డి, ఖాజాపాషా, డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, నరేశ్ పాల్గొన్నారు.

ప్రమాదంలో పెద్దచెరువు!


చిలుకూరు పెద్ద చెరువు నుంచి తీసిన కాల్వ ద్వారా దిగువకు వెళ్తున్న నీరు


నీళ్లు వెళ్లకుండా గురువారం కాల్వను పూడ్చేసిన దృశ్యం

ఎఫ్‌టీఎల్ స్థాయికి మించి అడుగు మేర నిలిచిన నీళ్లు

- అధిక నీటిని దిగువకు వదలడంలో శాఖల మధ్య సమన్వయ లోపం
- ఎగువ నుంచి వస్తున్న వరదతో మరింతగా పెరుగుతున్న నీటి మట్టం

మొయినాబాద్: ప్రమాదకర స్థాయిలో నిండిన చిలుకూరు పెద్ద చెరువులోని నీటిని దిగువకు వదిలేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శిఖం రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎఫ్‌టీఎల్‌కు మించి ఒక అడుగు ఎత్తుకు చేరిన నీటిని విడుదల చేయకపోతే ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందంటున్నారు. కానీ నీటిని వదిలే విషయంలో మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. ఎక్కువగా ఉన్న నీటిని కిందికి వదిలేందుకు ఇరిగేషన్ అధికారులు కాలువ తీయగా కొందరు స్థానికులు మూసేశారు. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరదతో చెరువు నీటిమట్టం మరింత పెరుగుతోంది. బ్యాక్ వాటర్‌తో ఓ వైపు పంటలు మునుగుతుండగా.. మరోవైపు గ్రామానికి ముప్పు పొంచి ఉంది. అలుగుపై మట్టి పేరుకుపోవడం, కింది భాగంలో రోడ్డు నిర్మించడంతో చెరువులో ఎఫ్‌టీఎల్ స్థాయికి మించి ఒక అడుగు మేర నీరు నిలుస్తోంది. వారం రోజుల క్రితం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ చెరువును పరిశీలించి, నీటిని కొద్దికొద్దిగా దిగువకు వదిలేయాలని అధికారులకు సూచించారు. దీంతో నీళ్లు వెళ్లేందుకు బుధవారం ఇరిగేషన్ అధికారులు కాలువ తీశారు. కానీ రాత్రి వేళ కొందరు స్థానికులు కాల్వలో మట్టిపోసి మూసేశారు. ఎగువ నుంచి వస్తున్న నీళ్లతో చెరువులోని నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను అడగగా తమకు సంబంధం లేదని చెబుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కూళ్లకు స్వచ్ఛత పోటీలు

- ప్రమాణాలు పాటించిన పాఠశాలలకు ప్రోత్సాహకం
- ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్స్‌తో ఎంపిక
- ఉత్తమ ప్రతిభకు రూ. లక్ష, ప్రశంసా పత్రం


ప్రభుత్వ నంబర్ 1 పాఠశాల

తాండూరు: కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రమాణాలను మెరుగు పర్చేందుకు స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్ 2025–26 పేరిట ప్రోత్సాహకాలను అందించనున్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలు మెరుగు పడేందుకు ఈ పోటీలు దోహదపడ్డాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాయకల్ప ద్వారా స్వచ్ఛత పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆస్పత్రులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అదే తరహాలో యూ డైస్ ఆధీనంలోని పాఠశాలలకు స్వచ్ఛ ఏవమ్ హరిత్ ద్వారా పోటీలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

వికారాబాద్‌లో..

జిల్లాలోని 20 మండలాల్లో 1,132 ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, రెసిడెన్షియల్స్ ఉన్నాయి. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 82 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. వారికి 4,565 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ 2025–26 రేటింగ్ పోటీలకు అవకాశం కల్పించింది. అందులో భాగంగా పాఠశాలల్లో 6 విభాగాలపై పోటీలు నిర్వహిస్తోంది. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన సమయంలో సబ్బుతో చేతులు కడుక్కోవడం, విద్యార్థుల ప్రవర్తన, సమర్థత, పాఠశాల ప్రమాణాలు, పచ్చదనం పరిశుభ్రత లాంటి అంశాలపై పోటీలను నిర్వహించనుంది. ఈ పోటీల్లో పాల్గొననున్న పాఠశాలల దరఖాస్తులు స్వీకరించేందుకు ఈ నెల 30 వరకు ప్రభుత్వం గడువు విధించింది.

మెరుగు పడనున్న పారిశుద్ధ్యం

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంతో వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగు దొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం, విద్యార్థుల ప్రమాణాలు మెరుగు పడేందుకు అవకాశం ఉంది. అయితే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విజయవంతం చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది.

అవగాహన కల్పించాం



వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకులాలు, రెసిడెన్షియల్స్, మోడల్ స్కూల్స్ ఈ పోటీలకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. అంతే కాకుండా ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాము.

– రేణుకాదేవి, డీఈఓ, వికారాబాద్ జిల్లా

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

వివరాలు వెల్లడించిన ఎంఈఓ వెంకటయ్య

తాండూరు రూరల్: నియోజకవర్గంలంలోని నాలుగు మండలాల్లో 80 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు తాండూరు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఆయా మండలాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేశారన్నారు. వారికి 6న పట్టణంలోని వినాయక కన్వెషన్ హాల్లో సన్మానిస్తారన్నారు.

ప్రతిభ చాటిన కేజీబీవీ విద్యార్థులు

అభినందించిన ఉపాధ్యాయులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రత్యేక అధికారి రాధిక

దుద్యాల్: చెట్టుపల్లి తండాలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చాటారని ప్రత్యేక అధికారిణి రాధిక గురువారం తెలిపారు. రెండు రోజులుగా కొడంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్–14 వాలీబాల్‌లో మొదటి స్థానంలో నిలిచారు. అండర్–17లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. రెండు విభాగాల్లో వైశాలి, సోనిబాయి, నవిత, శిరీష, అశ్విని, పూజ, నికిత, మమత, స్వాతి, దివ్య, నందిని, గాయత్రిలు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

అధ్వానరోడ్డుతో అవస్థలు

మరమ్మతు చేయించండి: కమిషనర్‌కు విన్నపం

తుర్కయంజాల్: ఇంజాపూర్– హయత్‌నగర్ అధ్వాన రోడ్డుతో అవస్థలు పడుతున్నామని, వెంటనే మరమ్మతు చేయించాలని పలువురు నాయకులు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని, భారీ వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడి, ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంశీధర్ రెడ్డి, రాజు, విజయ్, రాజ్ కుమార్, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

దుద్యాల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యమని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. పల్లెలు, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయత్‌రాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, కొడంగల్ మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కృష్ణ, శ్రీశైలం గౌడ్, సత్యనారాయణ, రవీందర్ నాయక్, అనంతయ్య, వెంకటప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డీజే వాడిన ఏడుగురిపై కేసు

- పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని అభియోగం
- డీజేతో పాటు వాహనం సీజ్
- ఇబ్రహీంపట్నం కోర్టులో అప్పగింత



మొగుళ్లవంపులో డీజేతో పాటు పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

యాచారం: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. యాచారం అనుబంధ గ్రామమైన మొగుళ్లవంపులో బుధవారం రాత్రి హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా బండ శ్రీనివాస్‌రెడ్డి, గౌరారం లింగారెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, రేసు రాము, పట్టణ చంద్రశేఖర్ రెడ్డి, మూడేడ్ల శ్యాంసుందర్, నాయిని వెంకట్‌రెడ్డి డీజే పెట్టి, ఎక్కువ సౌండ్‌తో రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బంది కలిగించారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారి విధులకు ఆటంకం కలిగించారు. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు డీజేతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, ఇబ్రహీంపట్నం కోర్టులో అప్పగించినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలి పారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో డీజేలను వాడొద్దని సూచిస్తున్నా కొంతమంది ప్రజలకు ఇబ్బ ందులు కలిగిస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దివ్యాంగుల హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఉపేందర్‌మాదిగ

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌మాదిగ డిమాండ్ చేశారు. మండలంలోని ఇన్ముల్‌నర్వలో గురువారం ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచని పక్షంలో ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి పట్టనట్లు వ్యవహరించడం సీఎం రేవంత్‌రెడ్డికి తగదన్నారు. పెన్షన్ల అంశంలో ప్రభుత్వం, సీఎం స్పందించని పక్షంలో ఈ నెల 8న కలెక్టరేట్లు, 12న తహసీల్దార్ కార్యాలయాలు, 20న హైదరాబాద్–విజయవాడ రహదారి దిగ్బంధం చేయడంతో పాటు 21 నుంచి 26 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో ధర్నాలు, 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన రహదారులపై ధర్నా లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఇప్ప టికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరా రు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు కోళ్ల శివ, రావుగళ్ల బాబు, శంకర్‌రావు, పెంటనోళ్ల రవికుమా ర్, రవి, రమేశ్, కృష్ణ, అశోక్, శివశంకర్ పాల్గొన్నారు.